క్లుప్తంగా

ఇంటర్ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఏబీవీ ప్రభంజనం



జనగామ : ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో జనగామ ఏబీవీ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఎంపీసీలో విద్యార్థిని పి.రమ్యశ్రీ 476/470 మార్కులు సాధించి స్టేట్ 2వ ర్యాంకు సాధించారు. బైపీసీలో రిమ్‌షాఫాతిమా 438/440 మార్కులు సాధించి స్టేట్ మొదటి ర్యాంకు సాధించి సత్తా చాటుకున్నారు. సీఈసీలో గౌసియా 484/500, ఒకేషనల్‌లో డి.శ్రావణి 492/500 స్టేట్ ర్యాంకులతో ఏబీవీ జూనియర్ కళాశాల కీర్తి ప్రతిష్టలను పెంచారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టారు. సత్తాచాటిన విద్యార్థులకు ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, యాజమాన్యం అభినందించింది.

పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలి

లింగాలఘణపురం : ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్ సూచించారు. శుక్రవారం క్లోం గ్రామంలో రైతులు సాగు చేసిన పత్తి పంటలను ఆయన పరిశీలించి మాట్లాడారు. పంటల మార్పిడితో భూసారం పెరిగి దిగుమతి ఎక్కువగా వస్తుందని చెప్పారు. ఈ నెల 15 లోపు పత్తి వేసుకునే అవకాశం ఉందని, నెలాఖరులోపు కంది వేసుకోవచ్చని చెప్పారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, ఏఈఓ వెన్నెల పాల్గొన్నారు.

పరామర్శ

పాలకుర్తి: మండల కేంద్రంలో మామిండ్ల మల్లయ్య అనారోగ్యంతో వారం క్రితం మృతి చెందాడు. శుక్రవారం అమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. తిరునగిరి రిటైర్డ్ టీచర్ రాధ సహకారంతో బియ్యాన్ని మృతుడి భార్యకు అందజేశారు. పరామర్శించిన వారిలో ట్రస్టు చైర్మన్ యతిపతి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి జీడి హరీష్, దాసరి మధు, శోభన్ ఉన్నారు.

కొడకండ్ల : మండలంలోని పాకాలలో మాజీ జెడ్పీటీసీ బాకి లలితప్రేమ్‌కుమార్ దంపతులను శుక్రవారం ఎర్రబెల్లి ట్రస్ట్ చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావు పరామర్శించారు. ప్రేమ్ కుమార్ తండ్రి వెంకటయ్య మృతి చెందగా పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అలాగే ఇటీవల మృతి చెందిన ఎల్లమ్మ, వెంకన్న కుటుంబాలను ఆమె పరామర్శించారు. ఎంపీపీ జ్యోతి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రామోజీ, యూత్ అధ్యక్షుడు సతీష్‌గౌడ్, జెడ్పీటీసీ సత్తమ్మ, తుకారాం ఉన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

చిల్పూరు: 2003లో మండలంలోని రాజవరం గ్రామ బీఆర్‌ఎస్ మొదటి సర్పంచ్ అంగిడి కళమ్మ (70) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. మృతురాలికి కుమారుడు రవి ఉన్నాడు. ఆమె మృతి వార్త తెలియగానే ఎమ్మెల్యే రాజయ్య గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. సర్పంచ్ మారేపల్లి తిరుమలకృష్ణమోహన్‌రెడ్డి, ఎంపీటీసీ లలితశ్యాంకుమార్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, మల్లయ్య, వెంకటస్వామి, సంతాపం తెలిపారు.

బాలిక ఆత్మహత్య

జనగామ రూరల్ : ఓ బాలిక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం జనగామ పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం రాయపర్తి మండలంలోని కొండూర్‌కు చెందిన సాగారపు కుమారస్వామి, యాకలక్ష్మి దంపతులు బతుతకు దెరువు కోసం జనగామకు కొన్ని నెలల క్రితం వచ్చారు. పట్టణంలోని సూర్యపేట రోడ్డులోని బాలాజీ బార్ ప్రాంతంలో అద్దెకు ఉంటున్నారు. ఇద్దరు కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నారు. తన కుమార్తె శ్రావణి (16) బాలిక తల్లిదండ్రులతో ఉంటుంది. ఇటీవల పదో తరగతి పూర్తి చేసుకుంది. ఎప్పటిలాగే తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లగా సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా మృతికి గల కారణాలు తెలియరాలేదు.

కందిపప్పు సరఫరాకు టెండర్ల ఆహ్వానం

జనగామ: జిల్లాలోని 695 అంగన్‌వాడీ సెంటర్లకు నెల రోజులకు సంబంధించి 9,128 కేజీల కందిపప్పు సరఫరా చేసేందుకు ఆసక్తి ఉన్న వారు షార్ట్ టెండర్ వేసుకోవచ్చని జిల్లా స్థాయి కొనుగోలు కమిటీ, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు టెండరు కొటేషన్, కందిపప్పు శాంపిల్ తీసుకుని అదనపు కలెక్టర్ రెవెన్యూ విభాగంలో సమర్పించాలని సూచించారు. కొటేషన్స్, శాంపిల్ సరుకును జిల్లా స్థాయి కొనుగోలు కమిటీ పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఖరారు చేస్తుందని పేర్కొన్నారు.

మోదీ సభను విజయవంతం చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్/కొడకండ్ల/దేవరుప్పుల/ నర్మెట/ బచ్చన్నపేట/పాలకుర్తి : హన్మకొండలో శనివారం నిర్వహించనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు స్వచ్ఛందంగా అధిక హాజరై జయప్రదం చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి డాక్టర్ గుండె విజయరామారావు అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ మండలాల్లో జరిగిన సమావేశాల్లో రాష్ట్ర పార్టీ నాయకులు, జిల్లా మండల, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్ : సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరామారావు



దేవరుప్పులలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి



కొడకండ్ల : మాట్లాడుతున్న సోమయ్య



నర్మెట : మాట్లాడుతున్న ధరావత్ రాజు



బచ్చన్నపేట : మాట్లాడుతున్న బేజాడి బీరప్ప

'బాట పంచాయితీ'తో శ్రీహరికి సంబంధం లేదు

స్టేషన్‌ఘన్‌పూర్: మండల పరిధిలోని పాంనూర్‌లో వ్యవసాయ భూములకు వెళ్లే బాట పంచాయితీ విషయంలో ఎమ్మెల్సీ కడియం శ్రీహరికి ఎలాంటి సంబంధం లేదని పాంనూర్ సర్పంచ్ కోతి రేణుక, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు కోతి రాములు, రైతులు స్పష్టం చేశారు. పాంనూర్‌లో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కొత్తపల్లికి చెందిన రైతు పల్లె పాటి సోమిరెడ్డి, సరళాదేవి దంపతులు వారి కుమారుడు అఖిల్‌రెడ్డి పేరుతో 2010లో పాంనూర్‌లో ఇనుగాల వీరారెడ్డి నుంచి 8 ఎకరాల 14 గుంటల భూమి కొనుగోలు చేశారని చెప్పారు. వెనుకటి నుంచి ఆ భూమి గుండా నల్లబండకు వెళ్లే దారి ఉందని, సోమిరెడ్డి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లో పొన్న బీరయ్య తదితర రైతుల హద్దులు, పానాది ఉన్నాయన్నారు. అయితే సోమిరెడ్డి ఎంసీ, ఏడీలతో సర్వే చేయించుకుని ఇష్టారాజ్యంగా బాటను చెరిపేసి కాస్తు చేసుకోవడంతో..చేసేది లేక పారుగున ఉన్న రైతులు కలిసి పొన్న బీరయ్య, చేరాలు, కొమురయ్య, మాదిరెడ్డి మంజుల తదితరుల నుంచి రూ.1.60 లక్షలతో 6 గుంటల భూమిని బాట కోసం కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. అందులో వేసిన దారి భూమి తన పరిధిలోకి వస్తుందని ధ్వంసం చేయడంతో.. బాధితులమంతా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు ఎమ్మెల్సీ కడియం వద్దకు వెళ్లగా.. చట్టపరంగా న్యాయం చేయాలని పోలీసు ఉన్నతాధికారులకు కడియం సూచించారని చెప్పారు. తాము బాటకోసం కొనుగోలు చేసిన స్థలాన్ని సోమిరెడ్డి ఆక్రమించడమే కాకుండా కడియంపై, పోలీసు అధికారులపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఇనుగాల సంపత్‌రెడ్డి, రైతులు కోతి భిక్షపతి, గొడుగు సూరయ్య, తాళ్లపెల్లి దేవయ్య, ఓర్సు రమేష్, పొన్న కొమురయ్య, బీరయ్య, వల్లెపు బుచ్చయ్య, షేక్ మదార్, పెంటు, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోతి రాములు, రైతులు

కమ్యూనిటీ హాల్ నిర్మించాలి



తరిగొప్పుల: మండలంలోని అంకుషాపురంలో పద్మశాలి సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరుతూ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి సంఘం సభ్యులు వినతిపత్రం సమర్పించగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలో సర్పంచ్ ముక్కెర బుచ్చిరాజు, మాజీ ఎంపీపీ నూకల కృష్ణమూర్తి, సంఘం అధ్యక్షుడు భిక్షపతి, కిషన్, ప్రేమ్‌కుమార్, సాంబారి కృష్ణమూర్తి, ఉమాశంకర్ ఉన్నారు.

పద్మశాలీలు చైతన్యవంతం కావాలి

- సంఘం జిల్లా అధ్యక్షుడు బాలరాజు

జఫర్‌గఢ్ : సమస్యలపై పద్మశాలీలు చైతన్యవంతులు కావాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల బాలరాజు కోరారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండల కేంద్రంలో ఆయన సంఘం నాయకులు, పద్మశాలీ కులస్తులతో కలిసి సభ్యత్వ నమోదుపై సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి సంఘం మండల అధ్యక్షుడు డాక్టర్ మామిడాల సోమనారాయణ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా బాలరాజు మాట్లాడుతూ జిల్లాలో సభ్యత్వ నమోదు ముమ్మరంగా సాగుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 60 వేల సభ్యత్వ నమోదును పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నట్లు తెలిపారు. సంఘంలో చేరి బలోపేతానికి పాటుపడాలని కోరారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, పరమేశ్వర్, అంజయ్య, వెంకటేశ్వర్లు, నర్సింగం, రమేష్, అనిల్ పాల్గొన్నారు.



సంఘ సభ్యత్వాన్ని ప్రారంభిస్తున్న బాలరాజు

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న కిరణ్‌కుమార్ గౌడ్

జనగామ : జిల్లా కేంద్రం గణేష్‌వాడకు చెందిన చింతకింది శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట 18వ వార్డు అధ్యక్షులు ఆకునూరి వెంకన్న, బీఆర్‌ఎస్ నాయకులు ఆలేటి జహంగీర్, వికలాంగుల జిల్లా అధ్యక్షుడు మేకల సమ్మయ్య, మహిళా అధ్యక్షురాలు బొట్ల సుమతి, చింతకింది సత్యనారాయణ, అశోక్, మాదాసు శ్రీకాంత్, చింతకింది యాదగిరి, బాలలక్ష్మి, స్వప్న, రాణి, ఉదయ్, సాయి ఉన్నారు.

వర్గీకరణ సాధించే వరకూ పోరాటం

రఘునాథపల్లి/జఫర్‌గఢ్/బచ్చన్నపేట/జనగామ రూరల్/తరిగొప్పుల/దేవరుప్పుల: సామాజిక ఆర్థిక రాజకీయ అసమానతలను నిర్మూలించి ఎస్సీ వర్గీకరణ సాధిస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ అన్నారు. ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రఘునాథపల్లి, జఫర్‌గఢ్, బచ్చన్నపేట, జనాగామ రూరల్, తరిగొప్పుల, దేవరుప్పుల మండల కేంద్రాల్లో శుక్రవారం ఎంఆర్‌పీఎస్ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సమాజంలో వెనుకబాటుతనం పోవాలంటే ఎస్సీ వర్గీకరణ ఏకైక మార్గం అని దీనికోసం మాదిగలు ఐక్యంగా పోరాడాలన్నారు. సమావేశాల్లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రఘునాథపల్లిలో జెండా ఆవిష్కరిస్తున్న ఉపేందర్

మోదీ పర్యటన సందర్భంగా ముందస్తు అరెస్ట్

స్టేషన్‌ఘన్‌పూర్/చిల్పూరు/జఫర్‌గఢ్/నర్మెట/ బచ్చన్నపేట/కొడకండ్ల/దేవరుప్పుల/ పాలకుర్తిటౌన్ : ప్రధాని మోదీ వరంగల్ జిల్లా పర్యటన సందర్భంగా కాంగ్రెస్ నాయకులను, సీపీఎం, సీపీఐ నాయకులను ముందస్తు అరెస్ట్ చేయడం సరికాదని పార్టీ జనగామ జిల్లా కాంగ్రెస్ నాయకులు అన్నెబోయిన భిక్షపతి, పార్టీ మండల అధ్యక్షుడు నూకల ఐలయ్య పేర్కొన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరులో గద్దమీది సురేష్, లవన్, దేవి తిరుపతిరెడ్డి, యాదవరెడ్డిలను, సీపీఎం నాయకులు రమేష్, యాకయ్య, మహేందర్‌లను ముందస్తుగా అరెస్ట్ చేశారు. జఫర్‌గఢ్‌లో జరిగిన సమావేశంలో రాజేందర్, యాదగిరి, అనిల్, ఎల్లగౌడ్, సత్యనారాయణతో పాటు తదితరులు పాల్గొన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీలు ఒక్కటేనని అభివృద్ధిని మరిచి ప్రజలను మోసం చేస్తున్నారని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గంగ నర్సింహారెడ్డి ఆరోపించారు. అరెస్ట్ అయిన వారిలో నర్మెట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగిటి అంజయ్య, టౌన్ అధ్యక్షుడు శ్రీధర్, బాల్ సింగ్, సీపీఐ, సీపీఎం నాయకులు కృష్ణ, రాజా రాం, మల్లేషం తదితరులున్నారు. బచ్చన్నపేటలో కాంగ్రెస్ పార్టీ, సీపీఎం పార్టీ నాయకులను అరెస్ట్ చేసి సాయంత్రం సొంత పూచీకత్తుపై వదిలి పెట్టామన్నారు. వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, వెంకటేష్ ఉన్నారు. మోదీ వరంగల్ పర్యటన నేపథ్యంలో మండల కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. జనగామ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోమనర్సయ్య, కొడకండ్ల పట్టణ అధ్యక్షుడు రవీందర్, యూత్ ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ, మనోహర్, వెంకన్నలను అరెస్ట్ చేశారు.



నర్మెట : పోలీస్ స్టేషన్‌లో నాయకులు

బీజేపీ, బీఆర్‌ఎస్ దొందూ దొందే

వరంగల్‌లో తలపెట్టిన మోదీ పర్యటన సభ పేరిట బీఆర్‌ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేయక పోవడంతో ఆ పార్టీలు దొందూ దొందేనని తేటతెల్లమైందని సీపీఐ జిల్లా నాయకుడు బిల్లా తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ దేవరుప్పుల మండల అధ్యక్షుడు కృష్ణమూర్తి ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రం, గ్రామాల్లో కాంగ్రెస్, సీపీఐ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. సీపీఐ మండల కార్యదర్శి ఎల్లయ్య, కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షుడు యాకస్వామి, నాగరాజు ఉన్నారు.

భార్య, పిల్లలను వదిలి భర్త పరార్

- అక్కున చేర్చుకున్న అమ్మ ఫౌండేషన్
- సఖి సెంటర్‌కు అప్పగింత

జనగామ: ప్రేమ వివాహం చేసుకున్న పదేళ్ల తర్వాత భార్య, ఇద్దరు పిల్లలను రోడ్డుపై వదిలేసి పారిపోయిన ఓ ప్రబుద్ధిడి ఘటన శుక్రవారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు, సఖి సెంటర్ నిర్వాహకులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు రాష్ట్రం కందుకూరుకు చెందిన ప్రసన్న, షేక్ లతీఫ్ పదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వివాహానికి అమ్మాయి కుటుంబ సభ్యులు అంగీకరించకపోవడంతో బతుకుదెరువు కోసం జనగామ జిల్లా పాలకుర్తికి వచ్చారు. లతీఫ్ మేస్త్రీ పని చేస్తూ భార్య, తన ఇద్దరు కుమారులు ఆకాష్, మణిలను పోషించుకుంటున్నాడు. ఈక్రమంలో భార్య, భర్తల మధ్య చిన్నపాటి గొడవలు జరిగినప్పటికీ, సర్దుకు పోతూ ఉన్నంతలో బతికారు. ఇక్కడ సంపాదన లేదని హైదరాబాద్‌కు వెళితే పిల్లలను బాగా చదివించవచ్చని భార్యకు నచ్చజెప్పిన లతీఫ్ ఇంటిని ఖాళీ చేయించాడు. పిల్లలు, భార్యతో సహా, సామాగ్రిని ఆటోలో ఎక్కించి జనగామకు పంపించే క్రమంలో బైక్‌పై వెనకాలే వస్తానని నమ్మబలికాడు. భార్య ఆటో ఎక్కే సమయంలోనే ఆమె వద్ద ఉన్న ఫోన్‌లో పూర్తి డాటా డిలీట్ చేసి, స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. దీనిని భార్య ప్రసన్న గమనించలేదు. ఆటోలో బయలు దేరి ఉదయం 10.30 గంటలకు జనగామ చౌరస్తాలోని సూర్యాపేట రోడ్డులో దిగి, భర్త కోసం సాయంత్రం 6 గంటలు ఎదురు చూసింది. ఎంతకూ రాకపోవడంతో ఆందోళన చెందిన ఆమె కన్నీళ్ల పర్యంతమవుతుంటే, అక్కడే ఉన్న ఆటో డ్రైవర్ మల్లేష్ వెంటనే అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మంతెన మణి కుమార్ సమాచారం అందించారు. పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాత, వారు సఖి సెంటర్ కౌన్సిలర్ రాధికకు వివరించారు. అక్కడ నుంచి ప్రసన్న, ఇద్దరు కుమారులను సఖి సెంటర్‌కు తరలించారు. వారికి కౌన్సిలింగ్ ఇచ్చిన తర్వాత, బంధువులు లేదా వరంగల్‌లోని సదార్ ఆశ్రమానికి పంపిస్తారు. అంతకు ముందు భర్త జాడ తెలుసుకునే ప్రయత్నం చేశారు. కార్యక్రమంలో గండి నాగరాజు, పండుగ నరేష్, బింగి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వీఓ సీఏను సస్పెండ్ చేయాలి

నర్మెట: అవినీతికి పాల్పడిన ఆదర్శ వీఓ సీఏ శ్రీలతను సస్పెండ్ చేయాలని మచ్చు పహాడ్ యువజన సంఘం నాయకులు శుక్రవారం సర్పంచ్ రామిని శివరాజ్, ఏపీఎం నాగేశ్వర్‌రావులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సంఘాల గ్రూప్‌కు చెందిన రూ. 6 లక్షలు బ్యాంకు మేనేజర్‌తో కలిసి అవినీతికి పాల్పడిందని విచారణ జరిపించి సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో జడల రమేష్, గుండేటి రాంచందర్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొంపెల్లి అంబేడ్కర్, రాజశేఖర్, నాగపురి రాజు, శ్రీకాంత్, శ్రీకాంత్, ప్రశాంత్ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు దారుణం

జనగామ: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వరంగల్ పర్యటన నేపథ్యంలో పోలీసులు అక్రమ అరెస్టులు చేయడం దారుణమని, ఈ చర్యను ఖండిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో సమావేశం ముగించుకొని బయటకు వెళ్తున్న క్రమంలో పోలీసులు కనకారెడ్డితో పాటు నాయకులను అరెస్ట్ చేసే క్రమంలో రోడ్డుపై బైఠాయించారు. అనంతరం కనకారెడ్డి మాట్లాడుతూ ప్రధాని వరంగల్‌కు వస్తే.. జనగామలో అరెస్టులు చేయడమేమిటని అన్నారు. ఆయన వెంట రాపర్తి సోమన్న, బూడిది గోపి, దూసరి నాగరాజు, లింగం, సురేష్, వెంకటేష్, ఉపేందర్, పద్మ, కల్యాణి, రజిత తదితరులు పాల్గొన్నారు.

విద్య వజ్రాయుధం



స్టేషన్‌ఘన్‌పూర్: విద్య ద్వారా ఏదైనా సాధించవచ్చని, విద్య వజ్రాయుధమని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. మండలంలోని శివునిపల్లి జెడ్పీఎస్‌ఎస్‌లో చదివిన పూర్వ విద్యార్థులు గుర్రం దేవ పీఈసెట్‌లో స్టేట్‌ఫస్ట్ ర్యాంకు, మాలోతు సురేష్ ఐఐటీ–2022లో జాతీయ స్థాయిలో ఎస్టీ విభాగంలో 333వ ర్యాంకు సాధించగా వారికి అభినందన, సన్మాన సభను శుక్రవారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం కొండపల్లి ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గుజ్జరి రాజు, ఘన్‌పూర్ సర్పంచ్ సురేష్‌కుమార్, శివునిపల్లి ఎంపీటీసీ గుర్రం రాజు, హెచ్‌ఎంలు కె.ప్రవీణ్, ఎండీ.తహసీన్, పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షులు జొన్నల రాజేశ్వరరావు, పాల్గొన్నారు.

నేడు కరెంటు కోతలు

జనగామ: పట్టణంలో నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు పనులు నడుస్తున్నందున శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఎన్‌పీడీసీఎల్ ఏఈ శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేటరోడ్డు ఎడమవైపు, ప్రిస్టన్, దుర్గమ్మగుడి ఏరియా, శ్రీనివాస్‌నగర్ కాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

రఘునాథపల్లి,లింగాలఘణపురంలో..

రఘునాథపల్లి 132 కేవీ ఎస్ఎస్ నిర్వహణలో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రఘునాథపల్లి, కోమల్ల, కంచనపల్లి, మండెలగూడెం, నిడిగొండ, ఖిలాషాపూర్, అశ్వరావుపల్లి, గబ్బెట, కుందారం, వనపర్తి సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ కోతలు ఉంటాయని పేర్కొన్నారు.

స్వీపర్ల సమస్యలను పరిష్కరించాలి

జనగామ రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్ల సమస్యలు తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన దీక్షకు వారు మద్దతు తెలిపారు.

జీపీ కార్మికులకు వేతనాలు పెంచాలి

లింగాలఘనపురం : చాలీచాలనీ వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్న పంచాయతీ కార్మికుల వేతనాలు సత్వరమే పెంచాలని కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు తూటి దేవదానం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో జీపీ కార్మికుల దీక్షలో మాట్లాడారు.

రెండో రోజుకు చేరిన సమ్మె

కొడకండ్ల/రఘునాథలపల్లి/నర్మెట/ బచ్చన్నపేట/జనగామరూరల్/దేవరుప్పుల: తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది శుక్రవారం రెండో రోజు కొనసాగించారు. ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారంతో రెండో రోజుకు చేరుకుంది. సమ్మెలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవి సంఘీభావం తెలిపారు. సమావేశంలో అశోక్, భాస్కర్ సిబ్బంది ఉన్నారు. వేతనాలు పెంచడంతోపాటు పర్మినెంట్ చేసి మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేయాలని కారోబార్ బిల్ కలెక్టర్లను సహాయకార్యదర్శులుగా నియమించడంతో పాటు మరణిస్తే రూ. 10 వేలు ఆర్థికసాయం అందజేయాలని సంఘం అధ్యక్షుడు పిల్లి సిద్ధులు టీఆర్‌ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు మల్లా చారి స్పష్టం చేశారు. శుక్రవారం 2వ రోజు తమ అపరిష్కృత సమస్యలు, హక్కుల సాధన కోసం ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పండ్ల పంపిణీ

జనగామ రూరల్ : మండలంలోని మండెలగూడెం గ్రామానికి చెందిన గాదె ప్రవీణ్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం పట్టణంలోని చౌరస్తాలో పేదలకు అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

జఫర్‌గఢ్ : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నాయకులు, విద్యార్థులు కలిసి ప్రధాన రహదారిపై శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

బీమాను సద్వినియోగం చేసుకోవాలి


జఫర్‌గఢ్ : తపాలా శాఖ వారు నూతనంగా ప్రవేశపెట్టిన రూ.10 లక్షల బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ వరంగల్ డివిజన్ జిల్లా సూపరింటెండెంట్ నర్సింహస్వామి కోరారు. స్థానిక సబ్ పోస్టాఫీసు కార్యాలయం వద్ద శ్రుకవారం బీమా సౌకర్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి బీమా సౌకర్యం కల్పించేందుకు తపాలా శాఖ కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కేవలం ఏడాదికి 396, 399 డబ్బులు చెల్లించిన వారికి 10 లక్షల బీమా సౌకర్యాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సబ్‌పోస్ట్‌మాస్టర్ రవికుమార్, ఎబీపీఎం ఎండీ.అంకూస్, రోహిత్, బాలు, ప్రత్యూష, రవికుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



బీమా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నర్సింహస్వామి

నెల్లూరు బీచ్‌లో జనగామ వాసి గల్లంతు

జనగామ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు దర్గా దర్శనానికి వెళ్లిన జనగామ యువకుడు సముద్రంలో గల్లంతయ్యాడు. పట్టణంలోని లక్ష్మీ బాయికుంటకు చెందిన ఎండీ.జలాల్ కుమారుడు ఎండీ చాంద్‌పాషా(18), అతడి సోదరుడు ఈనెల 6న బంధువులతో కలిసి నెల్లూరు దర్గాలో జరిగే రొట్టెల పండగకు వెళ్లారు. దర్శనం ముగిసిన తర్వాత చాంద్‌పాషా సమీపాన ఉన్న మహిపాడ్ బీచ్‌కు వెళ్లాడు. సముద్రంలో స్నానం చేసే క్రమంలో వచ్చిన అలల్లో చాంద్‌పాషా కొట్టుకుపోయాడు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతో పాటు జాలర్లు, గత ఈతగాళ్ల వెతుకుతున్నట్లు బంధువులు తెలిపారు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు, స్నేహితులు నెల్లూరుకు బయలు దేరారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



చాంద్‌పాషా (ఫైల్)